# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక






అమలాపురం | సంపుటి : 10 సంచిక : 23 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | శనివారం 15 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 23 15-03-2025 Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## హోలీ రంగుల కేళీ

హోలీ పండుగ సందర్భంగా విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌లో యువతీ యువకులు రంగుల పండుగలను ఘనంగా జరుపుకున్నారు. ఆనంద కేరింతలతో ఆహ్లాదంగా ఆనందంగా వేడుక చేసుకున్నారు. అనంతరం బీచ్‌లో స్నానాలు చేసి కేరింతలు కొట్టారు.

## 121 గ్రామాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్

అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

121 గ్రామాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్ ఏపీ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. 189.9 కిలోమీటర్ల పొడవుతో రూపొందించనున్న ఈ ఓఆర్ఆర్, హైదరాబాద్ ఓఆర్ఆర్ కంటే పెద్దదిగా ఉండనుంది.

**భూసేకరణకు వేగం**

అధికారులు ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఏపీ ప్రభుత్వం, ఎన్ హెచ్ ఏఐ ప్రతిపాదిత ఎలైన్‌మెంట్‌లో

- తరువాయి 2లో..



## మార్చి 24 - 25న జాతీయ బ్యాంకుల సమ్మె




బ్యాంకు ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్స్ (IBA) జరిగిన చర్చలు విఫలమయ్యాయని బ్యాంకు యూనియన్లు (UFBU) తెలిపాయి. దీంతో ప్రణాళిక ప్రకారం మార్చి 24- 25 తేదీల్లో యథావిధిగా సమ్మె జరుగుతుందని స్పష్టం చేశాయి. ఐబీఏతో జరిగిన సమావేశంలో అన్ని కేడర్లలో నియామకాలు, ఐదు రోజుల పని దినాలు వంటి సమస్యల్ని యూఎఫ్ బీయూ సభ్యులు లేవనెత్తారు. వీటిపై జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఈ సమస్యలపై ఎటువంటి పరిష్కారం లభించలేదని.. అందుకే ముందు ప్రకటించినట్లు గానే రెండు రోజుల పాటు సమ్మె ఉంటుందని తెలిపారు.



## వచ్చే నెల 15న అమరావతికి ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఖరారైంది. రాజధాని పున:ప్రారంభ పనులకు ఏప్రిల్ 15న ఆయన హాజరుకానున్నారు. రూ. లక్ష కోట్ల అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున రాజధాని పనులు ప్రారంభించి మూడేళ్లలో ముగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

## పాల్గొన్న లోకేష్ దంపతులు



అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

యుగయుగాల దేవుడు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 12 గంటలకు నిర్వహించిన స్వామి వారి కల్యాణమహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ప్రభుత్వం తరఫున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివార్లకు విష్వక్షణ ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, మధుపర్క నివేదన, స్వామివారి పాదపక్షాలన, విశేష అర్చన, మహా సంకల్పం, ముత్యపు తలంబ్రాలు, బ్రహ్మముడి, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ దంపతుల రాకను పురస్కరించుకుని ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ నరసింహస్వామ దేవాలయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ దంపతులకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## శ్రీనివాస కల్యాణంకి చంద్రబాబును ఆహ్వానించిన బీఆర్ నాయుడు



అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీనివాస కల్యాణంకి చంద్రబాబును ఆహ్వానించిన బీఆర్ నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈరోజు ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకుని ప్రత్యేక ఆహ్వానం అందించారు. రేపు (మార్చి 15) అమరావతి సమీపంలోని వెంకటపాలెంలో నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి హాజరయ్యేలా సీఎం చంద్రబాబును

- తరువాయి 2లో..

# పిఠాపురం జనసంద్రం...

- కాసేపట్లో జనసేన 'జయకేతనం' సభ
- పిఠాపురంలో జనసేన 12వ ఆవిర్భావ సభ
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి జనసైనికుల రాక
- 1,700 మంది పోలీసులతో భారీ భద్రత



అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ పిఠాపురం మండలంలోని చిత్రాడలో కాసేపట్లో ప్రారంభం కానుంది. జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరుగుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో జనసైనికులు పిఠాపురంకు తరలివచ్చారు. భారీగా వచ్చిన జనసైనికులతో పిఠాపురం జనసంద్రంగా మారింది. సభా ప్రాంగణం స్వాగత మార్గాలను కొబ్బరి ఆకులు, ఫ్లెక్సీలు, జెండాలతో అలంకరించారు. ఆరు చోట్ల పార్కింగ్ ప్రాంగణాలు, నాలుగు చోట్ల భోజన వసతులు, ఏడు చోట్ల వైద్య శిబిరాలు, ఎక్కడికక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. 14 అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచారు. 1,700 మంది పోలీసులు భద్రతను కల్పిస్తున్నారు. వీరికి సాయంగా 500 మంది పార్టీ వాలంటీర్లు భద్రతా విధుల్లో ఉన్నారు. కాసేపట్లో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడకు చేరుకోనున్నారు.

## ఒంటిపూట బడుల టైమింగ్స్‌లో మార్పు

### తాజా ఉత్తర్వులు..!!



అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వేసవి తీవ్రత పెరుగుతోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఒంటి పూట బడుల పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టైమింగ్స్ వెల్లడించింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 24 వరకు ఒంటి పూట బడులు కొన సాగనున్నాయి. ఆ తరువాత జూన్ 12 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం ఒంటిపూట బడుల సమయాలు వేరుగా ఉన్నాయి.

ఒంటి పూట బడులు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాఠశాలలకు ఒంటి పూట బడులు ప్రకటించారు. ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రాష్ట్రాల్లోనూ అన్ని పాఠశాలలకు ఒంటి పూట బడులు అమలు కానున్నాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే విద్యా శాఖ అధికారులు వచ్చే విద్యా సంవత్సరం

- తరువాయి 2లో..



## మూడు రోజుల పాటు వడగాలులు

అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాష్ట్రంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంది. ఈ నెల 16 వరకు కోస్తాలో

- తరువాయి 2లో..

## శ్రీవారి ఆలయంపై వెళ్లిన ఎనిమిది విమానాలు

తిరుపతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీవారి ఆలయానికి సమీపంలో గురువారం ఒక్కరోజే ఎనిమిది విమానాలు వెళ్లాయి. ఇవన్నీ ఉదయం 7.15 నుంచి 8 గంటల మధ్యన వెళ్లాయి. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటువంటి విమానాలు వెళ్లరాదు. అయితే ఇటీవల కాలంలో విమానాలు ఆలయానికి సమీపం నుంచే పోతున్నాయి. ఇప్పటికే దీనిపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి లేఖ రాసిన విషయం తెలిసిందే.



తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# హిందీ వ్యతిరేకత ఎందుకు?

మత, భాష, ప్రాంతీయ ఉన్మాదాలు భారతదేశ సమగ్రతకు, సమైక్యతకు గొడ్డలి పెట్టు అనే విషయంలో దేశ హితాన్ని కోరే అందరి వ్యక్తుల అభిప్రాయం ఒకే విధంగా ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీ భాషపై అవాకులు చవాకులు పేలడం దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. 'త్రిభాషా సూత్రం' అమలులో భాగంగా హిందీనీ విద్యాలయాల్లో బోధించ డాన్ని వ్యతిరేకించడం తమిళ రాజకీయాలలో ఒక భాగమే.

దేశంలో తెలివైన విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి, విద్యార్థుల్లో 'ఈ దేశం నాది' అనే భావనను నిర్మాణం చేయడానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో 'నవోదయ' విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలు తమిళనాడుకు అవసరం లేదని ద్రవిడ పార్టీల నాయకులు అడ్డు కున్నారు. ఆ పాఠశాలల్లో హిందీని ఒక భాషగా బోధించడమే ఇందుకు కారణం. 'సర్వ శిక్షా అభియాన్' నిధులను తమిళనాడు రాష్ట్రానికి ఇవ్వడం విషయంలో కేంద్రానికి%–% రాష్ట్రానికి మధ్య చోటుచేసుకున్న వివాదం కారణంగా త్రిభాషా సూత్రం తమిళనాడు రాష్ట్రంలో అమలు చేయడం వీలు కాదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ బహిరంగ ప్రకటన చేయడంతో త్రిభాషా సూత్రం అమలు విషయంపై రాద్ధాంతం మళ్లీ తెరపైకి వచ్చింది.

దక్షిణ భారతంలో ఉన్న ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఈ విషయంపై అభ్యంతరాలు లేవు. త్రిభాషా సూత్రం అమలులో భాగంగా దక్షిణాదిలో రాష్ట్ర భాష, ఇంగ్లీషు, హిందీ బోధించేటట్లుబీ ఉత్తరాదిలో హిందీ, ఇంగ్లీషు, ఏదైనా దక్షిణాది రాష్ట్రాల భాష (తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం ఏదో ఒకటి) బోధించేటట్లు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఏకాభి ప్రాయంతో నాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే తమిళులు దీన్ని వ్యతిరేకించారు.

తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం ఈనాటిది కాదు. 1937లో 'ద్రావిడార్ కళగం' పేరుతో ఈవీ రామస్వామి తమిళ ప్రజలను రెచ్చగొట్టి, 'ఉత్తరాది వారి భాష హిందీ మనకెందు'కంటూ, తమిళ ప్రజల్లో హిందీ భాషపై ద్వేషాన్ని నూరి పోశారు. తమిళనాడులోని జస్టిస్ పార్టీ కూడా ఈ హిందీ వ్యతిరేక ఉద్యమానికి అండగా నిలిచింది. అగ్నికి ఆజ్యం పోసింది.

ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో అప్పటి రాజ గోపాలాచారి నేతృత్వంలోని మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వం రాజీనామా చేయడంతో ఉద్యమం చల్లారింది. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఇంగ్లీషు స్థానంలో హిందీని జాతీయ భాషగా ప్రవేశపెట్టాలని ఆలోచించడంతో 1965లో 'ద తమిళనాడు స్టూడెంట్స్ యాంటీ హిందీ యాజిటేషన్ కౌన్సిల్' పేరుతో తమిళ నాయకులు పెద్ద ఎత్తున హింసాత్మక ఉద్యమాన్ని లేవదీశారు.

ఉద్యమాన్ని అణచడానికి పారా మిలటరీ దళం రంగ ప్రవేశం చేయడంతో 500 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. నాటి ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి బలవంతంగా హిందీని తమిళ ప్రజలపై రుద్దే అవకాశం లేదని ప్రకటించడంతో ఉద్యమం ఆగి పోయింది.

ఈ ఉద్యమ ప్రభావంతో 1967 ఎన్నికల్లో తమిళనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోయింది. ఉత్తరాది ప్రజలు ఆర్య సంస్కృతికి చెందిన వారనీ, వారి భాష హిందీ అనీ, ఆ భాషను మాట్లాడటం తమిళుల ఆత్మగౌరవానికి భంగం అనే భావనను తమిళ ప్రజల మనసులో బాగా చొప్పించారు బ్రిటిష్ పాలకులు.

పాశ్చాత్య కోణంలో హిందూ సంస్కృతిని దునుమాడడమే ధ్యేయంగా పెట్టుకున్న ఈవీ రామ స్వామి బ్రిటిష్ పాలకులకు ఒక పనిముట్టుగా దొరికారు. ఆయన ప్రియ శిష్యుడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శ్రీరామునిపై, రామాయణంపై దుర్వ్యాఖ్యలు చేయడం, ఆయన మనుమడు ఉదయనిధి ఒక మంత్రి హోదాలో సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా లాంటిదని మాట్లాడటం బ్రిటిష్ వాళ్ళు నూరి పోసిన ఆర్య ద్రావిడ వాద ప్రభావమే! తమిళులే హిందీని వ్యతిరేకించడం వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే!

# వారానికి రెండు రోజులే తాడేపల్లిలో !

అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ఏపీలో ఉండబుద్ధి కావడం లేదు. ఆయన ఉన్నంత సేపు నిప్పుల మీద ఉన్నట్లుగా ఉండి సందు దొరకగానే బెంగళూరు ఫ్లైట్ ఎక్కేస్తున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం కోసం వచ్చిన ఆయన తర్వాత ఒక్క రోజు ఉండి మళ్లీ బెంగళూరు వెళ్లిపోయారు. బెంగళూరులో పార్టీ కార్యకర్తలకు..నేతలకు అందుబాటులో ఉండరు. అత్యంత ముఖ్య నేతల్ని మాత్రమే పిలిపించుకుని మాట్లాడుతున్నారు. తెర వెనుక రాజకీయాలకు బెంగళూరు కేంద్రంగా మార్చుకున్నారు. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా సరే జగన్ ఏ మాత్రం పట్టనట్లుగా వెళ్లిపోయారు. అనర్హతా వేటు పడకుండా ఉండేందుకు అటెండెన్స్ కోసం అన్నట్లుగా గవర్నర్ ప్రసంగానికి హాజరయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలను తీసుకెళ్లారు. తర్వాత ఆ పని కూడా చేయడం లేదు. అసెంబ్లీలో గత ప్రభుత్వ నిర్వాకాలను ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ముందు పెడుతున్నా స్పందించే వారు ఉండటం లేదు. జగన్ మోహన్ రెడ్డి కూడా ఎవరేమనుకుంటే నాకేంటి అనుకుని వెళ్లిపోతున్నారు. ఓ వైపు మండలిలో బొత్స అండ్ టీం పోరాడుతోంది. వారికి నైతిక మద్దతు ఇచ్చేందుకు కూడా జగన్ సిద్ధంగా లేరు. పోరాడుతున్న వారికి ప్రోత్సాహం ఇచ్చేందుకు దిశానిర్దేశం చేసేందుకు కూడా జగన్ ఏ మాత్రం ఆసక్తి చూపించడం లేదు. పరిస్థితి చూస్తూంటే.. ప్రజల్ని జగన్ ఇంకా తేలికగా తీసుకుంటున్నారని.. కూటమిపై కోపం వస్తే తనకే ఓటు వేస్తారని..తాను కష్టపడాల్సిన అవసరం లేదని అనుకుంటున్నారు. ఇంతకు ముందు మూడు, నాలుగు రోజులు అయినా తాడేపల్లిలో ఉండేవారు. ఇప్పుడు ఏదైనా సందర్భం వస్తేనే వస్తున్నారు. రెండు రోజులు ఉంటున్నారు.



## సొంత నేతలపై

# చంద్రబాబు ఆగ్రహం

## నామినేటెడ్ పదవుల భర్తీపై టెలీకాన్ఫరెన్స్

అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ సీఎం చంద్రబాబు నేడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు జరుగుతోందని, నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే, కొంతమంది నేతలు పేర్లను సిఫారసు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి సేవలందించిన వారికే నామినేటెడ్ పదవులు లభిస్తాయని, కృషి చేసిన వారి వివరాలను సమర్పించాలని నేతలకు చంద్రబాబు సూచించారు. చంద్రబాబు స్పష్టం చేసిన మరో ముఖ్య విషయం ఏమిటంటే, పార్టీ కోసం నిజంగా కృషి చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవులు దక్కేలా చూస్తామన్నారు. పార్టీ విజయానికి నిబద్ధతతో పనిచేసిన నేతల వివరాలను వెంటనే అందించాల్సిందిగా సూచించారు. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఇది పార్టీలో పనిచేసే వారికి మరింత నమ్మకం, ఉత్సాహాన్ని కలిగించే చర్య అని పేర్కొన్నారు.

**21 ఆలయాలకు ఛైర్మన్‌ల నియామకం**

ఈ సమావేశంలో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్‌లను నియమించనున్నట్లు ప్రకటించారు. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి వీరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఆలయాల పరిరక్షణ, భక్తుల సౌకర్యాల పెంపుదల వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

**60 వేల దరఖాస్తుల పరిశీలన**

నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటివరకు 60 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఒక్క దరఖాస్తుతోనే పదవి రాలేదని నిరాశ చెందవద్దని, రెండేళ్ల పదవీకాలం ముగిశాక మరికొందరికి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు పొందిన వారి పనితీరు కూడా సమీక్షకు లోనవుతుందని తెలిపారు.

పార్టీ శ్రేణులకు చంద్రబాబు కీలక సూచనలు చంద్రబాబు, టీడీపీ నేతలకు పలు సూచనలు చేశారు: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ నాయకులు ఎలా ప్రవర్తించారో, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే విధంగా కొనసాగాలని కోరారు. టీడీపీ నేతలు ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. తన వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నట్లు చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ఓటర్లకు సంక్షేమ పథకాలు ఇవ్వమని తాను చెప్పలేదని, సంక్షేమ పథకాలు పార్టీ రాజకీయాలకు అతీతంగా అందించబడతాయని స్పష్టం



చేశారు.

**సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత**

సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎలాంటి వివక్ష ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. సంక్షేమ కార్యక్రమాలను అందరికీ సమానంగా అమలు చేస్తామన్నారు.

**మంత్రులకు స్పెషల్ బాధ్యతలు**

గ్రూప్ రాజకీయాలను నివారించడం మంత్రుల బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తమ నియోజకవర్గాల్లో పర్యటనల సంఖ్యను పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కూటమిలోని మిత్రపక్షాల నేతలను కలుపుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

## 121 గ్రామాల మీదుగా

# అమరావతి ఓఆర్ఆర్

మార్పులను పరిశీలిస్తోంది. ఈ రింగ్ రోడ్ నిర్మాణం మొత్తం 23 మండలాల్లో, 121 గ్రామాల మీదుగా కొనసాగనుంది. గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని గ్రామాల మీదుగా ఈ మార్గం విస్తరించనుంది.

**ఏఏ ప్రాంతాల మీదుగా ఓఆర్ఆర్ ప్రయాణం?**

అమరావతి ఓఆర్ఆర్ గుండా వెళ్లే గ్రామాలపై స్థానిక ప్రజల్లో ఆసక్తి పెరిగింది. ఈ ఓఆర్ఆర్ గుంటూరు జిల్లాలో మంగళగిరి, తాడికొండ, దుగ్గిరాల, తెనాలి, పెదకాకాని, కొల్లిపర, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాలపై ప్రయాణించనుంది. పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, అమరావతి మండలాల్లోని కొన్ని గ్రామాలు ఈ మార్గంలో ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో వీరులపాడు, కంచికచర్ల, జి.కొండూరు, మైలవరం మండలాలను కవర్ చేయనుంది. కృష్ణా జిల్లాలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల మీదుగా సాగనుంది. ఏలూరు జిల్లాలో ఆగిరిపల్లి మండలం కూడా ఇందులో భాగమవుతోంది.

**అభివృద్ధి దిశగా మరో ముందడుగు**

అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణంతో భద్రత, కనెక్టివిటీ మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. రహదారి విస్తరణతో అభివృద్ధికి మరింత బలమైన మద్దతు లభించనుంది. దీని ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి మంచి అవకాశం కలగనుంది.

# శ్రీనివాస కల్యాణంకి చంద్రబాబును ఆహ్వానించిన బీఆర్ నాయుడు

ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతేకాదు, స్వామివారి ప్రసాదాన్ని అందించి, టీటీడీ తరఫున ఆశీస్సులు తెలిపారు.వెంకటపాలెంలో నిర్వహించనున్న ఈ భక్తి గీత కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా సమకూర్చినట్టు టీటీడీ ఛైర్మన్ ముఖ్యమంత్రికి వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు టీటీడీ పాలకమండలి సభ్యులకు సూచించారు.ఈ భేటీ సమయంలో టీటీడీ పాలకమండలి సభ్యులు, కార్యనిర్వాహణాధికారి (ఈవో), జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జేఈవో) తదితర అధికారులు హాజరయ్యారు. శ్రీనివాస కల్యాణానికి సంబంధించి భక్తులకు తగిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రసాదాల పంపిణీ, భక్తుల ప్రవేశ నియంత్రణ వంటి అంశాలపై చర్చించినట్టు సమాచారం. భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన శ్రీనివాస కల్యాణం, టీటీడీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల మధ్య జరిగేందుకు సిద్ధమవుతోంది. చంద్రబాబు హాజరైతే ఈ వేడుకకు మరింత మహిమను అందించనుందని టీటీడీ వర్గాలు భావిస్తున్నాయి.

# మూడు రోజుల పాటు వడగాలులు

వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. కాగా నిన్న ప్రకాశంలోని పెద్దదోర్నాలలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు %ఞూాణహీూ% వెల్లడించింది. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# ఒంటిపూట బడుల టైమింగ్స్‌లో మార్పు

అకడమిక్ క్యాలెండర్ ఖరారు చేసారు. ఈ మేరకు పాఠశాల నిర్వహణ సమయాలను ఖరారు చేసారు. దీంతో, వేసవి సెలవుల వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణలో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలకు రోజురోజుకూ ఒంటిపూట బడులు నడపాలని విద్యాశాఖ నిర్ణయించింది.

టైమింగ్స్ ఇలా

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట తరగతులు మాత్రమే నిర్వహిస్తారు. ఏపీలో ఉదయం 7.45 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న బడుల్లో మధ్నాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలోని పాఠశాలలు ఉదయం 8 గంట లకు ప్రారంభమై.. మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు కొనసాగుతాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సెంటర్లలో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేసవి సెలవులతో

రంజాన్ మాసం కావటంతో ఉర్దూ పాఠశాలలకు ఇప్పటికే ఒంటి పూట బడులు అమల్లోకి వచ్చాయి. ఇక, ప్రస్తుత విద్యా సంవత్సరంలో చివరి వర్కింగ్ డే ఏప్రిల్ 23 వరకూ హాఫ్ డే స్కూల్స్ కొనసాగ న్నాయి. ఈ సారి ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావర ణ శాఖ కూడా హెచ్చరిస్తోంది. ఎండల తీవ్రతను గుర్తించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అవస రమైన నిర్ణయాలు తీసుకోవాలని ఇప్పటికే విద్యా శాఖ కు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులుగా ఖరారు చేసారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తిరిగి జూన్ 12వ తేదీ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

# తాజంగి బీటాలైన్ కాలనీలో వేడుకలు

## 60 అడుగుల 'హోలీ టవర్' దహనం

**చింతపల్లి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




**అల్లూరి సీతారామరాజు జిల్లా తాజంగి బీటా లైన్ కాలనీలో హోలీ వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఒడిశా నుంచి వలస వచ్చిన వారంతా ప్రతి ఏడాది ఈ వేడుకలు చేస్తుంటారు. స్థానిక రాధాకృష్ణ ఆలయంలో గురువారం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, రామనామ జపంతో గ్రామంలో రాధాకృష్ణ విగ్రహాలను ఊరేగించారు.**

శుక్రవారం తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట 60 అడుగుల కర్రల పోగు (హోలీ టవర్)ను నిర్మించి వేకువజామున దహనం చేశారు. ఈ కర్రల పోగు చివరన ఉన్న జెండా ఏ దిక్కున పడుతుందో అటువైపు పంటలు బాగా పండుతాయని స్థానికుల నమ్మకం. ఈ జెండా పట్టుకున్న వ్యక్తులకు గ్రామస్థులు నగదు అందజేసి ఊరంతా ఊరేగించి సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది.

# బీసీలకు శుభవార్త.. రూ.20 వేలు సబ్సిడీ

## సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రూ. 20 వేల అదనపు సబ్సిడీ



**అమరావతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు శుభవార్త చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రూ.20 వేలు సబ్సిడీ రూపంలో అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. 2 కిలో వాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.1.20 లక్షలు వరకు ఖర్చవుతుండగా.. కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు రాయితీగా అందిస్తుంది. అయితే బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో రూ.20 వేలు అదనంగా రాయితీ అందించనున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దీని ప్రకారం 2 కిలో వాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రాష్ట్రం కూడా ఇచ్చే రాయితీతో కలిపి రూ.80 వేల వరకు సబ్సిడీ అందుతుంది. బీసీ వర్గాలకు అండగా ఉండాలనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశమై మొత్తం 10 సంస్థలకు చెందిన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. రూ.1,21,659 కోట్లు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 10 ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేసింది. అలాగే వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్ చేయాలని ఎస్ఐపీబీ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు నిర్ణయం తీసుకుంది.

# హోలీ వేడుకలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**రాజమహేంద్రవరం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

హోలీ పండుగను పురస్కరించుకుని నగరంలో జరిగిన పలు కార్యక్రమాలకు రాజమహేంద్రవరం సిటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. స్థానిక మెయిన్ రోడ్డు లోని జైన్స్ ఆలయం వద్ద, ఏవి అప్పారావు రోడ్డులోని గెయిల్ కార్యాలయం వద్ద, జేఎన్ రోడ్డులోని మన్యం గ్రౌండ్లో జరిగిన హోలీ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



# కాలం చెల్లిన చైనా 'చేప కథ'

**ఏ శాస్త్రంలోని నూతన ఆవిష్కరణ అయినా సామాజిక శాస్త్ర పర్యావరణ గీటురాయి మీద దాని మానవీయ విలువను నిర్ధారించుకోక తప్పదు. 2004 డిసెంబర్‌లో 'ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ' (ఐసీటీ) మన బడుల్లో పాఠంగా మొదలయింది. అది మొదలు గత రెండు దశాబ్దాలలో దానికి మొలకెత్తిన చిలవలు పలవలు... ఊడలు దిగిన మ్రానులైన పరిస్థితుల్లో, మన మానసిక వైఖరులు మన మానవీయ విలువలను ఎలా ప్రభావితం చేస్తున్నాయి? అన్నప్పుడు కొంచెం తేడాతో అందరం అందులో మునకలు వేయడం అయితే నిజం. మనకంటే ముందే ఈ అనుభవమున్న సంపన్న దేశాల్లో దీని పర్యవసానాలపై అధ్యయనం మొదలయింది కనుక ఈ ప్రపంచీకరణ కాలంలో ఆ కొలమానాలు మనమూ వాడుకోవచ్చు.**



గత పదేళ్ళలో పెరిగిన 'సోషల్ మీడియా' మన మీద పెంచుతున్న ఒత్తిడితో ఏర్పడిన 'ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం'లో ఇప్పుడు మనం ఉన్నాం. అదొక నూతన పర్యావరణంగా మారి, మన ఆలోచనలు అభిప్రాయాలు అందుకు అనుగుణంగా మార్చుతూ, మూడు రంగాలలో మన జీవితాల్ని అది ప్రభావితం చేస్తున్న దని ఫిబ్రవరి 2023లో ఎవాన్ కుహెన్ ఒక వెబ్సైట్‌కు రాసిన 'వాట్ ఈజ్ ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం?' వ్యాసంలో అంటారు.

గుర్తించిన ఆ మూడింటిలో 'సివిల్ సొసైటీ' (పౌరసమాజం) ఒకటి. ఈ పరిశీలన వెలుగులో కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 'పౌర సమాజం' సంగతి ఏమిటి? మన పండితులు పామ రుల అభిప్రాయాలపై ఎటువంటి 'సమాచార' పర్యా వరణ ప్రభావం ఉంది. ప్రభావశీలురైన ముగ్గురు ప్రముఖులు 2025 ఫిబ్రవరిలో వెలుబుచ్చిన అభిప్రా యాలలో నుంచి వాటిపై 'సమాచార పర్యావరణ' ప్రభావం ఏ మేర ఉందో చూద్దాం.

ఫిబ్రవరి మొదటివారంలో ప్రభుత్వ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన ఒక సమీక్ష సమావేశంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ %-% "మీరు ఫిర్యాదుల పరిష్కారం మొదటి ప్రాధాన్యతగా చూడాలి, రెవెన్యూశాఖ నుంచి భూ కబ్జాలు వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతున్నాయి. డాక్యుమెంట్స్ ఫోర్జరీ ఎక్కువ అయిపోయింది... వీటిని మీరు ఎలా పరిష్కరిస్తారు అనేది మీకే వదిలి పెడుతున్నాను" అన్నారు.

ఇది విన్నాక ఈ ధోరణి మూలాలు ఎక్కడ ఎందుకు మొదలయింది వెతికితే, రాజధాని హైదరాబాద్ నుంచి విజయవాడకు మారిన 2015 తర్వాత నుంచి రాజకీయం అంటేనే 'భూమి విలువ' అన్నట్టుగా మారింది. "అమరావతిలో అన్నీ పోను ఎనిమిది వేల ఎకరాలు మిగులుతాయి, ఎకరం 20 కోట్లు చొప్పున అమ్మితే 160 కోట్లు వస్తాయి..." తరహా మాటలు అధికార కేంద్రాల నుంచి వస్తే, 'సోషల్ మీడియా' దానికి విస్తృత ప్రచారం ఇచ్చింది.

ఇప్పుడు తెనాలి ప్రాంతానికి చెందిన ఏ.పి. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్ స్టడీస్' చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ కూడా విశాఖలో%-% "కొత్త రాష్ట్రానికి అమరావతి వంటి 'గ్రీన్ ఫీల్డ్ కేపిటల్' ఉండడం అవసరం" అంటూ పనిలో పనిగా %-%"ఉచితాలు అనుచితం" అని కూడా అనేశారు. పోనీ అది నిజమనుకుందాం. మరి వారే "బాపట్ల సమీపాన 20 ఏళ్ళనాడు ఆగిపోయిన 'వాన్ పిక్' ఈ పదేళ్లలో పూర్తి అయివుంటే, 'ఉచితాలు' తీసుకునేవారు అవి మాని అక్కడే ఏదో ఒక 'లేబర్' పని చేసుకుని బతికేవారు" అని కూడా అనొచ్చు కదా? చివరికి ఏమైంది గత పదేళ్ళలో 'రాజధాని' చుట్టూ 'సోషల్ మీడియా' వ్యాప్తి చేసిన 'ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం' కింద నలిగి కేంద్ర హోంశాఖ నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ నిపుణుల అభిప్రాయాలు ఇటువంటి ప్రకట నల కింద సమాధి అయ్యాయి.

రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బా రావు కూడా ఇదే విశాఖ నుంచి ఉచితాలు గురించి %-% 'ఫ్రీబీస్' ఎందుకు? అంటూ ఎప్పుడో పాతదైన 'చైనా వారి చేప' కథ చెప్పారు. అది చైనాలో నిజమేమో. ఇక్కడ 'చేపలు' పట్టడం నేర్పడం కోసం పెట్టిన 'స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం' ఏమైందో చూశాం. అయినా %-% 'ఫ్రీబీస్' ఎందుకు? అంటే, ఈ 'ఉచితాలు' పొందే వారు కూడా ఏమంత సంతోషంగా ఏమీ లేరు.

కారణం కళ్ళముందు సంపన్న వర్గాల వద్దకు చేరుతున్న సంపద, వారి విజయగాథలు, వైభవంగా జరిగే వారి పెళ్ళిళ్ళు, ఫ్యామిలీ ఫంక్షన్స్... వాటి గురించి 'సోషల్ మీడియా' కథలుగా చెబుతుంటే వింటూ, తమకు అందే అరకొరను వాళ్ళు తూకం వేస్తున్నారు. అధికార కేంద్రాలకు దగ్గరయితే, అక్రమ ఆదాయ వనరులు ఎలా పెరుగుతాయో 'సోషల్ మీడియా' వారికి నిత్యం కళ్ళకు కట్టిస్తున్నది.

విషయం ఏమంటే, ప్రభుత్వ పరిపాలనలోకి 'టెక్నాలజీ' వచ్చాక, అవినీతికి చిల్లులున్న చీకటి మార్గాలు మూతపడి అదాయ వనరులకు గండి పడితే, ప్రత్యామ్నాయాన్ని ప్రకృతి వనరుల్లో వెతు క్కుంటున్నారు. అభివృద్ధి మారుమూల గ్రామాలకు ప్రవేశిస్తుంటే, బయటకు వెళుతున్న మట్టి, కంకర చూస్తున్నదే.

వాటి వివరాలు 'సోషల్ మీడియా' 24 గంటలూ జనానికి చూపిస్తున్నది. ఈ అక్రమ లావా దేవీల చిట్టా సామాన్యుడికి అరచేతిలో 'ఫోన్'లో దొరుకుతుంటే, ప్రభుత్వం అరాకొరా ఉచితంగా ఇచ్చే రొట్టె ముక్కను ఇవ్వాలా వద్దా? అంటూ మళ్ళీ అదే పాత చర్చ అంటే, వారి వద్ద పాండిత్యం పరిహాసం అవుతుందేమో!

# చేజారుతున్న విత్తన స్వాతంత్ర్యం

**వ్యవసాయంలో విత్తనాల సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. హరిత విప్లవం పేరిట మొదలుపెట్టిన పరిణామం విత్తనాలతోనే మొదలైంది. అధిక దిగుబడి వంగడాల హామీతో ఇది మొదలై, క్రమంగా రైతులను విత్తనాలకు దూరం చేసింది. 1960వ దశకంలో మొదలు పెట్టిన ఈ మార్పు 2025 నాటికి తీవ్రరూపం దాల్చింది. ఆహార నాణ్యత దిగజారడానికి విత్తనాలలో వచ్చిన మార్పులే కారణం. దేశీ విత్తనాలను తులనాడి, భారత వ్యవసాయాన్ని హీనపరిచి తెచ్చిన హరిత అధిక దిగుబడి వంగడాలు క్రమంగా రైతుల విత్తన స్వావలంబనను హరించాయి.**



### రసాయనాల దిగుబడి

విదేశీయుల ప్రోత్సాహంతో ప్రవేశపెట్టిన వంగడాలు అధిక దిగుబడి ఇవ్వడానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు. రసా యన ఎరువులు ఉపయోగించని పరిస్థితులలో ఈ వంగడాలు ఉప యోగపడలేదు, ఉపయోగపడవు. ఆ విధంగా మొదలుపెట్టిన రసా యన ఎరువుల వాడకం ఇప్పుడు విధిగా, అత్యధికంగా ఉపయోగించాల్సిన పరిస్థితికి వచ్చింది. ఒకప్పుడు ఎకరాకు ఒకటో రెండో ఎరువుల బస్తాల వాడకం నుంచి ఇప్పుడు 15 బస్తాలు వాడే దుఃస్థితికి రైతు చేరుకున్నాడు. పరిశోధన చేసి ప్రవేశపెట్టిన హైబ్రిడ్ లేదా అధిక దిగుబడి వంగడాలు, ఎరువులు, కీటకనాశక రసాయనాల ఉపయో గాన్ని కూడా పెంచాయి. ఈ రకం విత్తనాలు మొదట్లో అధిక దిగుబడి చూపినా క్రమంగా ఉత్పాదకత తగ్గింది. దిగుబడి పెరిగి తగ్గుతోందని గుర్తించి ఒక కొత్త వాదన ప్రవేశపెట్టారు శాస్త్రవేత్తలు. విత్తనాలు ఎప్పటికప్పుడు మార్చాలి. మార్చితేనే దిగుబడి! ఏ ఆధునిక విత్తనంలోనూ నూరు శాతం అంకురోత్పత్తి ఉండదు. దాంతో మభ్యపెట్టే సిఫారసు మొదలైంది. ఎకరాకు ఎన్ని గింజలు వెయ్యాలి? సాధారణంగా ఒక్కో పంటకు ఒక్క కొలమానం ఉంటుంది. ఆధునిక విత్తనాల్లో అంకురోత్పత్తి వంద శాతం ఎప్పుడూ ఉండదు కనుక ఈ కొలమానంలో మార్పులు తెచ్చి ఎకరాకు ఎక్కువ విత్తనాలు వాడే విధంగా సిఫారసు చేయడం మొదలు పెట్టారు. వరి పంటకు కొందరు రైతులు ఎకరాకు 18 నుంచి 20 కిలోలు వాడుతుంటే, పరిజ్ఞానం ఉన్న రైతులు కేవలం 250 గ్రాముల దేశీ వరి విత్తనాలు వాడుతున్నారు. ఎంత తేడా! మిర్చి, పత్తి, వరి, గోధుమ, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడు తున్నది ప్రైవేటు కంపెనీలు, నష్టపోతున్నది రైతులు.

### పోయిన జ్ఞానం, నమ్మకం

ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది. ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. రైతుకు తన విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. వేరే రైతు దగ్గర తెచ్చుకున్నా నమ్మకం ఉండేది. రైతు తన విత్తనాలు కోల్పోయి ఆధునిక విత్తనాలకు అలవాటు పడ్డ తరువాత విత్తనాల మీద జ్ఞానం, నమ్మకం పోయినాయి. ఆధునిక విత్తనాలకు చీడ పీడ బెడద పెరిగింది. దానికి పరిష్కారంగా కీటక నాశనిల వాడకం పెరి గింది. వాటి వల్ల ఖర్చు పెరిగింది. ప్రమాదకరమైన రసాయనాలు కాబట్టి వాటిని వాడే క్రమంలో రైతు ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఫలితంగా వలసలు, ఆత్మహత్యలు. వ్యవసాయ కూలీ కుటుంబా లతో మొదలైన వలసలు రైతులను కూడా తాకాయి. ఇంకొక వైపు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయం మీద సలహాలు ఇచ్చే కంపెనీలు పెరిగాయి. వాటి వార్షికాదాయం యేటా పెరుగుతున్నది. బహుశా నార్మన్ బోర్లాగ్ కూడా ఈ పరిణామం ఊహించి ఉండక పోవచ్చు. బోర్లాగ్ ప్రవేశపెట్టిన 'అధిక దిగుబడినిచ్చే' విత్తనా లకు ఖరీదైన ఎరువులే కాక, ఎక్కువ నీరూ అవసరం. వ్యవసాయ ఉత్పత్తిలో అద్భుతాలు లేవు అని చెప్పిన ఈ వ్యక్తి, ప్రపంచానికి ఆహార భద్రత సాధించాలని మొదలు పెట్టిన 'ఆధునిక విత్తనాల' వ్యవసాయం జీవ వైవిధ్యాన్ని, జీవనోపాధులను నాశనం చేస్తున్న విషయం పట్ల స్పందించలేదు. 'అధిక వంగడాల' వల్ల దిగుబడి పెరుగుతుందనే ఏకైక సూత్రం మీద పని చేసిన ఆ మహానుభావుడు తద్వారా నిర్మాణమైన 'దోపిడీ' వ్యవస్థ గురించి ఆలోచించలేదు.

### పెద్ద కంపెనీల గుప్పిట్లో...

ఇప్పుడు 'ఆధునిక విత్తనాలు' రైతుల చేతులలో లేవు. విత్తన, పెస్టిసైడ్ కంపెనీల గుప్పిట్లో ఉన్నాయి. 'మేధో హక్కుల సంపత్తి' పేరిట రక్షణ పొంది విత్తన మార్కెట్లను సురక్షితం చేసుకున్నాయి. ఎప్పటికప్పుడు దిగుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో యేటా కొత్త 'విత్తనాలు' మార్కెట్లో ప్రవేశపెట్టి అటు ప్రభుత్వాలనూ, ఇటు రైతులనూ మభ్యపెడుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. మన దేశంలో విత్తనాలు, ప్రకృతి వనరుల మీద మేధో సంపత్తి హక్కులు పొందే అవకాశం లేదు కనుక ఇతర మార్గాలలో తమ వ్యాపారాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. పెద్ద కంపెనీలు సిండికేట్ అయ్యి చిన్న కంపెనీలను గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. మార్కెట్ ఒప్పందాలు చేసుకుని దేశీ, చిన్న కంపెనీలకు 'బంధనాలు' వేశారు. ప్రభుత్వం ఏదన్నా 'చర్య' చేపడితే కోర్టుకు వెళతారు. విత్తన కంపెనీలు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మీద వేసిన కేసులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి. రైతులలో విత్తనాల విజ్ఞానం కొండలా పెరగాల్సిందిపోయి, ప్రైవేటు గుత్తాధిపత్యం వల్ల వారికి అందడం లేదు. రానురాను విత్తన విజ్ఞానాన్ని రహస్యంగా మార్చుతున్నాయి విత్తన కంపెనీలు. ఇక్రి సాట్, ఇర్రి వంటి అంతర్జాతీయ సంస్థలు విత్తన పరిశోధనల సాకుతో భారతీయ జన్యు సంపద తీసుకుని, క్రమంగా ప్రైవేటు పెట్టుబడి దారులకు అందజేస్తున్నాయి. 1966 తరువాత నిర్మాణమైన ప్రభుత్వ విత్తన వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ఇప్పుడు ఉన్న సంస్థలు, కమి టీల పరిశోధనలు ఉత్సవ పాత్రకే పరిమితమై, పరోక్షంగా ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. ప్రభుత్వ రంగంలో ఏదో జరుగుతున్న భ్రమ కల్పించటానికి ఉపయోగపడుతున్నాయి. వ్యాపార సరళీకరణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి, దేశాభివృద్ధికి మూలమైన విత్తన రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ, ఉన్న ఒకే ఒక చట్టాన్ని అమలు చేయడం లేదు. 1966లో ప్రభుత్వం రంగంలో చేసే విత్తనాల నాణ్యత, సరఫరా మీద శాస్త్రీయ నియంత్రణకు తెచ్చిన విత్తన చట్టం ప్రైవేటు విత్తనాలకు వర్తింప జేయడానికి సిద్ధంగా లేదు. 2004లో ఒక కొత్త చట్టం తెచ్చే ప్రయత్నం ప్రైవేటు విత్తన కంపెనీల వ్యాపార వెసులుబాటును సరళీకృతం చేయడానికే అని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 20 యేళ్ల తరువాత కూడా అది రూపుదాల్చలేదు. ఇప్పటి వరకు ప్రతిపాదించిన 4, 5 ముసాయిదాలు రైతుల ప్రయోజనాలు కాపాడటానికీ, భారత దేశంలో ఉన్న అపర విత్తన సంపద స్వచ్ఛతను పరిరక్షణకూ ఉద్దేశించినవి కావు. రైతులు, కంపెనీల ప్రయోజనాల మధ్య కంపెనీల పక్షం వహిస్తున్న కేంద్రం కొత్త చట్టం తేవడానికి భయపడుతున్నది.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం 15 మార్చి 2025


# గ్లకోమా ఉచిత కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

**అమలాపురం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జాతీయ అంధత్వ దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్లకోమా అనేది కళ్ళకు సంబంధించిన వ్యాధి, కంటిలోపల పీడనం పెరిగి కంటి నరాలను చచ్చుబడి పోయేటట్లు చేస్తుందన్నారు. తద్వారా నెమ్మదిగా కనుచూపు తగ్గిపోతుందని, గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనపడక పోవచ్చునన్నారు. ప్రాధమిక దశలో గ్లకోమా 40 ఏళ్ళకు పైబడిన వ్యక్తులు తరచుగా కంటి అద్దాలు మార్చవలసి రావడం, వెలుతురు చుట్టూ రంగుల వలయం కనపడటం జరుగుతుందన్నారు. తరచుగా తల నొప్పితో పాటుగా కంటి ఎరుపు, వాంతులు, కనుగుడ్డు నొప్పి కలిగి ఉండడం జరుగుతుందన్నారు. 35 నుంచి 40 ఏళ్ళ వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పరీక్ష చేయించుకోవాలని ఆమె సూచించారు. ఇంతకు పూర్వం కనుగుడ్డుపై గాయం తగిలినవారు, స్టెరాయిడ్ మందులు అధికంగా వాడేవారు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. షుగరు, బి.పి వ్యాధిగ్రస్తులు రక్తసంబంధీకులలో ఎవరైనా గ్లకోమా వ్యాధితో బాధపడుతున్నట్లయితే ఆ కుటుంబ%శీ%లోని ప్రతీ ఒక్కరు గ్లకోమా పరీక్ష చేయించుకోవాలన్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని, ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో సూచించారు.

# స్వామి వారి నిత్య అన్నదానము నకు 1,11,1116 విరాళం.

**సఖినేటిపల్లి, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**





అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదానట్రస్ట్ కు ఏడిద గ్రామం, మండపేట వాస్తవ్యులు,రాష్ట్ర కిసాన్ సెల్ చైర్మన్ మరియు ఎ ఐ సిసి సభ్యులు కామన ప్రభాకరరావు మరియు వారి కుటుంబ సభ్యులు రూ.1,11,116/- లు విరాళముగా అందించారు. వారికి శ్రీ స్వామి వారి దర్శనానంతరము ఆలయ ఏసీ వి. సత్యనారాయణ శ్రీ స్వామి వారి చిత్రపటం మరియు ప్రసాదములను అందజేసారు.

# గాళ్లు టీకాలు పంపిణీ కార్యక్రమం




**మలికిపురం మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



జాతీయ వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా మలికిపురం మండలం మేడిచర్ల పాలెం లో గాళ్లు టీకాలు పంపిణీ కార్యక్రమం చేశారు.అమలాపురం ఉపసంచాలకులు డాక్టర్ కె ఎస్ వి వి ఎస్ మూర్తి మలికిపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు.జాతీయ వ్యాధి నిరోధక చర్యలు భాగంగా ప్రతి సంవత్సరంలో రెండుసార్లు గాళ్ల టీకాలు వేయించుకుని వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యమునకు ప్రతి రైతు సహకరించాలన్నారు.ఈ వ్యాధి సోకిన పశువులలో పాలు దిగుబడి పూర్తిగా తగ్గిపోకుండా ముందు జాగ్రత్తగా ప్రతి పశువులకు టీకాలు వేయవలసిన అవసరం ఉందన్నారు.అలాగే డాక్టర్ డి శివకుమార్ మాట్లాడితూ ఆపత్కాలంలో రైతులకు దేమంగా ఉండటానికి పాడిపశువులకు తప్పనిసరిగా ప్రభుత్వ ఇన్సూరెన్స్ 80 శాతం రాయితీలో చేయించుకోవాలన్నారు అయితే ఇన్సూరెన్స్ ప్రీమియం 1920 గాను రైతు 398 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు.మేలు జాతి పశువులకు లక్ష రూపాయలు వరకు భీమ సౌకర్యం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు బి ఆది సత్యనారాయణ,పి.సత్యనారాయణ,కె సుధాకర్,ఎం సత్యనారాయణ,సిబ్బంది ప్రేమ్,రవిబాబు పాల్గొన్నారు.

# కాలనీ వాసులకు రగ్గులు పంపిణీ




**మలికిపురం మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కార్డ్ ఇంటర్నేషనల్(నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్) పౌండర్ డాక్టర్ సుమన్ సి మల్లాడి,డాక్టర్ మంజుల మల్లాడి,అమెరికా దేశంలో స్థిరపడి హైదరాబాదులో కేంద్రంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ గురువారం సఖినేటిపల్లి మండలం అప్పనరాములనిలంక ఓఎన్జిసి కాలనీ కి చెందిన మహోన్నతుడు క్రీస్తుకల్వరి మందిరం సభ్యులకు రగ్గులు పంపిణీ కార్యక్రమము ఆ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్ చొప్పల ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు చేతుల మీదుగా వృద్ధులకు రగ్గులు పంపిణీ చేయడం జరిగింది అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న కార్డ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆర్గనైజేషన్ సభ్యులందరికీ సర్పంచ్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్,దేవ దయానంద్,పాస్టర్ నెల్లూరు రాజు,సంఘస్తులు పాల్గొన్నారు.

# రోడ్లు, ఏటిగట్ల పటిష్టతకు కొబ్బరి పీచు జియో టెక్స్ టైల్స్ మ్యాట్ల వినియోగం

## - సాధ్యాసాధ్యాలపై అంచనాలు రూపొందించాలి

## - ఇంజనీర్లకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశం



**అమలాపురం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

: డెల్టా ప్రాంత మైన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి వరద కట్ట, రోడ్లు, డ్రైన్లు పంట కాలువల గట్ల బలోపేతానికి, దీర్ఘ కాలిక మన్నిక పెరిగేందుకు కొబ్బరి పీచు జియో టెక్స్ టైల్స్ మ్యాట్ల వినియోగంపై సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని వివిధ విభాగాల ఇంజనీర్లకు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. అమలాపురం కలెక్టరేట్ లో వివిధ విభాగాల ఇంజనీర్లకు శ్రీ క్వాయర్ పరిశ్రమల కేంద్రం ప్రతినిధి త్రిమూర్తులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్ల నిర్మాణంలో బలోపేతం, శాస్త్రీయపరంగా లేయర్ల నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఇంజనీర్లకు అవగాహన పెంపొందించారు. రానున్న ఏప్రిల్ ఆర్థిక సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్టుగా రోడ్ల నిర్మాణంలో సాంకేతికతను జోడిస్తూ రోడ్ల దళసరి లేయర్ల నిర్మాణం లేయర్లలో మెటీరియల్ స్థానిక మట్టి వినియోగంతో ఎస్.ఎస్.ఆర్ రేట్లకు అదనంగా సాంకేతిక ఖర్చు కూడా జోడిస్తూ అంచనాలు రూపొందించి మంజూరు కోరుతూ రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. లూజ్ సాయిల్ ఉన్నచోట్ల క్వాయర్ టెక్స్ టైల్స్ మ్యాట్లు వినియోగం వల్ల రోడ్లు, గట్లు బలోపేతం అవడమే కాకుండా పరోక్షంగా కొబ్బరి పీచు పరిశ్రమలకు తగిన డిమాండ్ స్థానికంగా లభిస్తుందన్నారు. అదేవిధంగా జియో సింథటిక్ ఇతరత్రా సాంకేతికతను జోడించడం మూలంగా రోడ్ల పటిష్టతతో పాటు దీర్ఘకాలిక మన్నిక పెరుగుతుందన్నారు. రోడ్లపై బరువైన వాహనాల రాకపోకలకు అనుగుణంగా సాంకేతికతను జోడించాలని ఆయన సూచించారు ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే జిల్లా అంతటా ఈ సాంకేతికతను జోడించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.వి.వి.కిషోర్, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈఈ బి.రాము, పంచాయతీరాజ్ ఎస్సీ పి.రామకృష్ణారెడ్డి, డిఈ మన్యం రాంబాబు, డ్వామా పిడి ఎస్.మధుసూదన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీ.కే.పీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ కుమార్‌ను కలిసిన తెదేపా మాల నాయకులు

**మలికిపురం మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ తో రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాల నాయకులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు గెడ్డం సింహ స్వగృహమందు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పెదపూడి విజయకుమార్ దృష్టికి నియోజకవర్గంలోనున్న మాల నాయకులు పలు విషయాలను తీసుకెళ్లారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద ఎస్సీలను అడ్డుపెట్టుకుని ఎస్సీయేతరులు లబ్ధిపొందుతున్నారని, అటువంటి ఎస్సీయేతరులు గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని తెదేపా మాల నాయకులు కార్పొరేషన్ చైర్మన్ కు వివరించారు. కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ హామీలేని రుణాలను నిజమైన లబ్ధిదారులకు కార్పొరేషన్ ద్వారా అందించాలని, ఎస్సీ సామాజిక వర్గాల వారు వ్యాపారాలు చేసుకునేందుకు కార్పొరేషన్ వాణిజ్య కాంప్లెక్స్ లను నిర్మించాలని తెదేపా మాల నాయకులు చైర్మన్ ను కోరారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను నేరుగా లబ్ధిదారులకు అందించే పద్ధతిలో బ్రోకరేజ్ చేసే వాళ్ళను దూరం పెట్టాలని, రాజోలు నియోజకవర్గంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇప్పించడంలో ఒక వ్యక్తి బ్రోకరేజ్ చేస్తూ ఎస్సీయేతరులకు లబ్ధిని చేకూరుస్తున్నాడని ఆవ్యక్తికి సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతో సంబంధాలు ఉన్నాయని తెదేపా మాల నాయకులు కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడికి తెలియచేసారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని రాజోలు వైస్ ఎంపీపీ పోలుమూరి శ్యాంబాబు కార్పొరేషన్ చైర్మన్ ను కు విజ్ఞప్తి చేసారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసే బాధ్యతను సంబంధిత అధికారులు విస్మరించారని, రాజోలు నియోజకవర్గంలో ఎస్సీలు అన్నీ విషయాలలో వివక్షతకు గురౌతున్నారని తెదేపా మాల నాయకులు కార్పొరేషన్ చైర్మన్ కు తెలియచేసారు. తెదేపా మాల నాయకుల చెప్పిన విషయాలన్నీ సావధానంగా విన్న కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి సానుకూలంగా స్పందించారు. తెదేపా మాల నాయకుల ఆవేదన తనకు అర్థం అయ్యిందని త్వరలనే పరిష్కరించే విధంగా కృషిచేస్తానని పెదపూడి విజయకుమార్ హామీ ఇచ్చారు.అనంతరం చైర్మన్ పెదపూడి విజయకుమార్ ను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెదేపా ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ గోనిపాటి రాజు,తాడి సత్యనారాయణ,బందెల పద్మ,మోకా పార్వతీ,ఓగురి సూరిబాబు,రాపాక ఆనంద కుమార్,గెడ్డం వసంతకుమార్,జిల్లెళ్ళ బాబు ప్రసాద్,కొల్లాబత్తుల వెంకటరమణ,రాపాక నవరత్నం,చవ్వాకుల వెంకటరత్నం,ఇంజేటి రత్నరాజు,కడలి దుర్గా,నల్లి బాబురావు,తాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

## - కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు - పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



**కొత్తపేట మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొత్తపేట నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటానని, నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో ఇంటింటికే త్రాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కొత్తపేట గ్రామంలోని పనసలదొడ్డిలో రూ.57.20 లక్షలతో, పెదగూళ్లపాలెంలో రూ.57.20 లక్షల రూపాయలతో, మందపల్లిలో రూ.66 లక్షలతో నిర్మించే ఓ.హెచ్.ఎస్.ఆర్ వాటర్ ట్యాంకులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసారు. అలాగే మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి వారి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.24 లక్షలతో నిర్మించే మరుగుదొడ్లకు శంకుస్థాపన చేశారు. ఎనిమిది యూనిట్ల మరుగుదొడ్లను నిర్మించి త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధర్, టీడీపీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ధరణాల రామకృష్ణ, విళ్ళ మారుతి, మిద్దె ఆదినారాయణ, మందపల్లి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి అయినవిల్లి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అప్పన్న పెళ్లికొడుకాయెనే..



- పెళ్లిచూపులు దిగొచ్చిన అప్పన్న స్వామి
- సోదరి పైడితల్లిని పిల్లనివ్వమని వేడుకోలు
- అమ్మవారు పిల్లనివ్వడానికి అంగీకారం
- అప్పన్నస్వామి భక్తులలో ఆనందోత్సవం
- సింహాచల దేవస్థానం కార్యనిర్వహణాధికారి సమక్షంలో ముగిసిన పెళ్లిచూపులు కార్యక్రమం



సింహాచలం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జైశ్రీమన్నారాయణుడైన శ్రీ వరహాలక్ష్మి నృశింహస్వామి ని నుదుటున కల్యాణతిలకం దిద్ధి , పెండ్లి కొడుకుగా తిర్చిదిద్ది బయలుదేరారు . శుక్రవారం నాడు స్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పలు ఆరాధన కార్యక్రమాల అనంతరం వేదపండితుల పారాయణ అనంతరం స్వామిని సర్వసుందరంగా తీర్చిదిద్ది పల్లకిపై అధిష్టించి మెట్ల మార్గం గుండా బోయీల సాయంతో కొండదిగువకి చేర్చారు . తొలి పావంచం వద్ద గ్రామపెద్దలు , గ్రామస్తులు నాదస్వర వాయిద్య మేళతాలాలతో స్వాగతం పలికి గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయానికి చేర్చారు . అర్చకస్వాములు అప్పన్న సోదరైన పైడితల్లి అమ్మవారిని తన పిల్లనిచ్చి వివాహము జరిపించమని స్వామివారు కోరారు . అందుకు అమ్మవారు అంగీకారం తెలిపి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నారు .





## దళిత ఉద్యోగాలంతా సంఘటితం కావాలి

### ఎస్సీ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా, మండల నూతన కార్యవర్గం ఎన్నిక




భీమవరం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రస్తుత పరిస్థితుల్లో దళిత ఉద్యోగాలంతా సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి రత్న ప్రదీప్ అన్నారు. భీమవరం బిఆర్ అంబేద్కర్ భవనంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ, భీమవరం మండల కమిటీ ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కే రాజ్ కిషోర్ (తహశీల్దార్), సెక్రటరి ఎస్ శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్ బి జ్యోతి, ట్రెజరర్ జి కృష్ణ మోహన్, మండల అధ్యక్షులుగా వి రాజేష్ కుమార్, సెక్రటరి కే గౌతమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి రాజేష్, ట్రెజరర్ పి సుదీర్ బాబు సభ్యులను ఎన్నుకున్నారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. రత్న ప్రదీప్ మాట్లాడుతూ దళిత ఉద్యోగాలు ఐక్యంగా ఉండి, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్టీ ఎస్సీ ఉద్యోగులను ఈ అసోసియేషన్ లో చేర్చేలా కృషి చేయాలని, ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆర్ రాంబాబు, జి మురళీ కృష్ణ, కే శ్రీనివాస్ రావు, కేసి రాజు, గంటా సుందర్ కుమార్, ఎస్ సలీం రాజు, జే ఏసు బాబు, పల్సన్, ఎం కాళి, మానస, మహంకాళి, జి జక్రారయ్య, ఏ లలిత కుమారి, డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## 9 రకాల పుష్పాలతో అమ్మవారికి నవవర్ణచన

భీమవరం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి పౌర్ణమినిపురస్కరించుకుని 9 రకాల పుష్పాలతో నవవర్ణచన, చక్రార్చన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన గణేశుల ఆనంద్, ఉమాదేవి దంపతులు, ధనరాజ్ (నాని)లచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 9 రకాల పుష్పాలతో నవవర్ణచన, చక్రార్చన, కుంకుమార్చన, హెూమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## తిరుమలలో ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి.



తిరుపతి మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వాయువ్య దిశలో ఉన్న కుమారధార తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా తీర్థానికి విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకుల సహకారంతో పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, సాంబారు అన్నం, పెరుగన్నం, పులిహోర, మజ్జిగ, తాగునీరు అందించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రకృతి సౌందర్యాల నడుమ నిర్వహించే కుమారధార తీర్థముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం భక్తులు ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు. కుమారధార సందర్భంగా మార్గంలో చేసిన ఏర్పాట్లను అన్న ప్రసాదం, ఆరోగ్య విభాగం, అటవీశాఖ, విజిలెన్స్, శ్రీవారి సేవ, పోలీసు శాఖ అధికారులు పర్యవేక్షించారు. ప్రాశస్త్యం వరాహ, మార్కండేయ పురాణాల ప్రకారం ఒక వృద్ధ బ్రాహ్మణుడు శేషాచల గిరుల్లో ఒంటరిగా సంచరిస్తుండేవాడు.శ్రీ వేంకటేశ్వరస్వామివారు ప్రత్యక్షమై "ఈ వయస్సులో చెవులు వినిపించవు, కళ్లు కనిపించవు.. అడవిలో ఏం చేస్తున్నావు" అని ప్రశ్నించారు. యజ్ఞయాగాలు ఆచరించి దైవరుణం తీర్చుకోవాలనే తలంపుతో ఉన్నాను అని వృద్ధుడు బదులిచ్చాడు. అనంతరం స్వామివారి సూచన మేరకు ఈ తీర్థంలో వృద్ధుడు స్నానమచరించగా 19 ఏళ్ల నవ యువకుడిగా మారిపోయాడు. ముసలి వయసు నుంచి కౌమార్యంలోకి మారిపోవడం వల్ల ఈ తీర్థానికి 'కుమార ధార' అనే పేరు వచ్చింది. పద్మ, వామన పురాణాల ప్రకారం దేవలోక సేనాధిపతి శ్రీ కుమారస్వామి రాక్షసుడైన తారకాసురిని సంహారం తరువాత శాపవిమోచనం కోసం ప్రయత్నించాడు. శివుని సూచన మేరకు శేషాచల పర్వాతాల్లోని వృషాద్రిలో తపస్సు చేశాడు. అనంతరం ఈ తీర్థంలో స్నానమాచరించి శాపవిమోచనం పొందాడు. సాక్షాత్తు శ్రీ కుమారస్వామివారు స్నానం చేయడం వల్ల ఈ తీర్థానికి 'కుమారధార' అనే పేరు స్థిరపడింది



## కన్నుల పండుగ సీతారాముల వసంతోత్సవ కార్యక్రమం

### రామయ్య పెళ్ళికొడుకు, సీతమ్మ పెళ్లికూతురుయనే

విఆర్‌పురం మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి శ్రీ సుందర సీతారామ చంద్ర స్వామి వారి వసంతోత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పురోహితులు పురుషోత్తమ అన్నమాచార్యులు చేతుల మీదుగా పెరుమాళ్ళ వసంతోత్సవమును కన్నుల పండుగ జరిపించారు, అన్నమాచార్యులు ఈ వసంతోత్సవము గురించి వచ్చిన భక్తులకు వివరిస్తూ వసంత రుతువు మాఘ పౌర్ణమి రోజున ఆరు రుతువులను వర్ణించబడుతూ శ్రీరాముడు, పెళ్లికొడుకు, సీతమ్మ పెళ్లి కూతురు చేస్తూ నాలుగు వేదాలని నాలుగు గొలుసులుగా వర్ణిస్తూ పురాణాలను తలపించేటట్లుగా శ్రీ సీతరామచంద్ర స్వామి వారికి అభిషేకాలు చేసి పెళ్ళికొడుకుగా అలంకరించి గొలుసుల ఉయ్యాలలో ఉంచి స్వామివారికి లాలి , జోల పాటలు పాడి భక్తిశ్రద్ధలతో స్వామి వారికి సేవ చేస్తూ మహెూత్సవము జరుపుతారు, ఈ మహెూత్సవమునే శ్రీరాముని కళ్యాణానికి నాందిగా పలుకుతారు ఇప్పటినుంచి స్వామివారి కళ్యాణానికి కావలసిన ఏర్పాట్లను తలంబ్రాలను తయారు చేసుకుని ముక్కోటి దేవతలకు తెలిసే విధంగా స్వామి వారు పిలుపునిస్తారు అని వివరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ వారు మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపిస్తామని వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని శబరి గోదావరి నది ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు బోట్లను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పెద్దలు, గ్రామ పెద్దలు, యావన్మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు

# యుద్ధం ఆపేందుకు సిద్ధం!

**30 రోజుల కాల్పుల విరమణకు పుతిన్ సూత్రప్రాయ అంగీకారం**

**భారత్, చైనా, దక్షిణాఫ్రికాలకు ధన్యవాదాలు తెలిపిన రష్యా అధ్యక్షుడు**



**మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. అయితే ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఇంకా కసరత్తు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. "ట్రంప్ ఆలోచన సరైందే. కచ్చితంగా మేం మద్దతిస్తాం" అని మాస్కోలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో పుతిన్ ప్రకటించారు.**

"అయితే కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని మా అమెరికా మిత్రులతో ఇతర భాగస్వాములతో చర్చిస్తాం. ఒప్పందం ఉల్లంఘన కాకుండా.. సరైన యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. యుద్ధం ఆపాలన్న ప్రతిపాదనకు మేం అంగీకరిస్తున్నాం. అయితే కాల్పుల విరమణ.. శాశ్వత శాంతి దిశగా సాగుతుందన్న ఆశాభావంతో అందరం ముందుకు వెళ్లాలి. సమస్య మూలాలను తొలగించాలి" అని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌ను అమెరికా ఒప్పించినట్లు కనిపిస్తున్నా.. యుద్ధక్షేత్రంలో పరిస్థితిని అంచనా వేసుకొనే కీవ్ కాల్పుల విరమణకు అంగీకరించిందని రష్యా అధ్యక్షుడు పేర్కొనడం గమనార్హం. ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్న ట్రంప్‌నకు పుతిన్ ధన్యవాదాలు తెలిపారు.భారత్, చైనా, దక్షిణాఫ్రికా నేతలకూ కృతజ్ఞతలు చెప్పారు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందంలో ఈ మూడు దేశాలు కూడా కీలక పాత్ర పోషించాయన్న సంకేతం ఇచ్చారు.

### స్వాగతించిన ట్రంప్

వాషింగ్టన్: యుద్ధ విరమణపై రష్యా నుంచి మంచి సంకేతాలొచ్చాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. పుతిన్‌తో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

## కిమ్ ఒక న్యూక్లియర్ పవర్.. ట్రంప్

**ఉత్తరకొరియా : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చారు.**



కిమ్‌తో సంబంధాలను పునరుద్ధరించే ఆలోచన ఉందా? అని విలేకరి ప్రశ్నించగా.. 'కిమ్ జోంగ్ ఉన్‌తో నాకు మంచి సంబంధం ఉంది. ఏం జరుగుతుందో చూద్దాం. కానీ, కిమ్ కచ్చితంగా ఒక న్యూక్లియర్ పవర్' అని ట్రంప్ బదులిచ్చారు. ఈసందర్భంగా రష్యా, చైనా వద్ద ఉన్న అణ్వాయుధాల గురించి ఆయన ప్రస్తావించారు. అణ్వాయుధాల సంఖ్యను తగ్గించగలిగితే అది గొప్ప విజయమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి అనే దానికంటే.. అవి ఇతరుల వద్ద కూడా ఉండటం అవసరమని ట్రంప్ తెలిపారు. కిమ్ వద్ద అణ్వాయుధాలు చాలా ఉన్నాయన్నారు. భారత్, పాకిస్థాన్ వంటి ఇతర దేశాల వద్ద కూడా ఉన్నాయని, వాటిని ఇతరులకు సైతం ఇవ్వాలని ట్రంప్ పేర్కొన్నారు.

గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్ విషయంలో పట్టువిడుపులతో వ్యవహరించారు. 2019లో వియత్నాంలో వీరిద్దరూ భేటీ అయ్యారు. అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉ.కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలం అయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరుదేశాల మధ్య దూరం పెరిగింది. తాజాగా అగ్రరాజ్యం విషయంలో కిమ్ వైఖరి మరింత కఠినంగా మారింది. ట్రంప్‌తో ఎటువంటి వ్యక్తిగత దౌత్యాలు నడపకూడదని ఆయన నిర్ణయించారు.

మరోవైపు.. దక్షిణ కొరియా–అమెరికా సైనిక విన్యాసాలు, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలతో కొరియా ద్వీపకల్పంలో నిత్యం ఉద్రిక్త వాతావరణమే ఉంటుంది. ద.కొరియా–యూఎస్ సైనిక విన్యాసాలను తమపై దాడికి సన్నాహంగా కిమ్ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ద.కొరియాలోని బుసాన్ పోర్ట్‌లో అమెరికాకు చెందిన విమాన వాహక నౌకను మోహరించారు. ఇది కిమ్ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. ఈక్రమంలోనే కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ అగ్రరాజ్యం రచ్చగొట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరికలు చేశారు.

# జోనల్ వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం




**స్వచ్ఛ సర్వేక్షన్, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర,పి4 ,వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వేల కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించండి.**

**విశాఖ జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్**

విశాఖపట్నం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలైన స్వచ్ఛ సర్వేక్షన్ ,స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర, పి 4,వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వే కార్యక్రమాలపై జోనల్ ,వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించి వార్డు సచివాలయాల పరిధిలో నిత్యం పర్యవేక్షించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ ఉన్నతాధికారులతో, జోనల్ కమిషనర్లు,జోనల్, వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఇన్చార్జి కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా విశాఖ నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే బృందం సర్వే కొద్ది రోజుల్లో నిర్వహిస్తుందని అందుకు తగిన అన్ని పారామీటర్లలో లోపాలను గుర్తించి సవరించే విధంగా సచివాలయ పరిధిలో వార్డు కార్యదర్శులు చేపడుతున్న విధులను , అలాగే సిటిజన్ ఫీడ్ బ్యాక్ పై ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి నుండి చెత్త సేకరణ ,తరలింపు ,హెూం కంపోస్టింగ్ తదితర కార్యక్రమాలపై నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోలతో వార్డు కార్యదర్శులు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లు నిత్య పర్యవేక్షణ జరుపుతూ నేరుగా ప్రజలను కలిసి సంబంధిత విషయాలపై అడిగి తెలుసుకోవాలన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ప్రత్యేక థీమ్ గా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, థీమ్ ఆధారితంగా ఆ నెలలో నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలని, మార్చి 15వ తేదీ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలన ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయాలని కమిషనర్ వార్డ్ స్పెషల్ అధికారులకు ఆదేశించారు. అలాగే నగరంలో జరుగుచున్న పి4 సర్వే ను మార్చి 18వ తేదీలోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని, వర్క్ ఫ్రం హెూం సర్వే కూడా పూర్తి చేసి ప్రతి ఇంటిలో ఇంటి నుండి వర్క్ ఫ్రాం హెూమ్ చేస్తున్నారా లేదా అనే సర్వే చర్యలపై నిత్య పర్యవేక్షణ జరపాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమాలపై జోనల్ కమిషనర్లు జోనల్ , వార్డు స్థాయి ప్రత్యేక అధికారులతో సచివాలయ పరిధిలో నిత్యం పర్యవేక్షిస్తూ సమీక్ష నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆదేశించారు. విశాఖ నగరం ప్రథమ స్థానంలో స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా విశాఖ నగరానికి అన్ని అవకాశాలు ఉన్నందున సంబంధిత పారామీటర్లలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్ణీత సమయంలో అన్నిటిని సమకూర్చి పరిశుభ్రత చర్యలు చేపట్టి స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేకు ఈ నగరాన్ని అందంగా ,పరిశుభ్రతంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు.. జోనల్, వార్డు సాయి స్పెషల్ అధికారులు తో, సచివాలయ వార్డు కార్యదర్శులతో తరచుగా టెలి,వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించి ఈ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల వలన ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా వ్యాధులు ప్రబలకుండా అవసరమగు ముందస్తు నియంత్రణ చర్యలను చేపట్టాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ ,ఆర్ .సోమన్నారాయణ ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద్ రాజు ,ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ ,చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకర్ రావు, పిడి– యుసిడి పీఎం సత్యవేణి, డి సి ఆర్ ఎస్, శ్రీనివాస్, అందరు జోన్ కమిషనర్లు, డి డి హెచ్ ఎం .దామోదర్ రావు, పర్యవేక్షక, కార్యనిర్వాహక ఇంజనీర్లు, అందరు జోనల్ స్థాయి, వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మెస్సులను పరిశీలించిన వైస్ ఛాన్సలర్

**ఉదయం విద్యార్థులతో కలిసి టిఫిన్ తిన్న వీసీ**

**పరిశుభ్రతకు, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి ఆదేశం**

**సత్వరం చర్యలకు ఉపక్రమించిన అధికారులు**



విశాఖపట్నం, మార్చి 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) ఆంధ్ర విశ్వవిద్యాయం విద్యార్థుల మెస్ లను ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలోని మెస్ లను ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి అక్కడే అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, మెనూ అమలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ప్రధానంగా వాష్ బేసిన్ కు వెళ్లే మార్గం పరిశుభ్రంగా లేదని దీన్ని తరచూ శుభ్రం చేయాలని సంబంధించిన సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆహార పదార్థాలు వండి సిద్ధం చేసే వంటశాల సైతం పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులు కూర్చునే టేబుల్ కి సంబంధించిన కుర్చీలు కొన్ని చోట్ల విరిగి ఉండటం ఆయన దృష్టికి వచ్చింది. వీటిని వెంటనే మార్పు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను మరింత పెంచాలని సూచించారు. మెస్సులలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పెంపొందించడంలో, పర్యవేక్షణలో విద్యార్థులను సైతం భాగస్వాములు చేస్తామని, తక్షణం దానిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నిన్న రాత్రి భోజన నాణ్యత బాగోలేదంటూ విద్యార్థులు ఏయు మెయిన్ గేటు వద్ద ధర్నా చేశారు. దీంతో వెంటనే స్పందించిన వైస్ ఛాన్సలర్ ఉదయాన్నే చర్యలకు ఉపక్రమించారు.



విద్యార్థుల మెస్ లను సందర్శించి అక్కడ ఆహార నాణ్యతను తనిఖీ చేసి సిబ్బందికి తగిన ఆదేశాలను ఇచ్చారు. ఇకపై నిరంతరం హాస్టల్ మెస్ లపై పర్యవేక్షణ ఉంటుందని వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు.

మధ్యాహ్న భోజన సమయంలో వైస్ ఛాన్సలర్ మరొక మెస్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజన నాణ్యత పరిశీలించారు. అనంతరం సాయంత్రం విద్యార్థులతో అకాడమిక్ సెనేట్ మందిరంలో సమావేశం అయ్యారు. హాస్టల్లో ఉన్న సమస్యలను విద్యార్థులతో చర్చించి వారి నుంచి సమగ్ర వివరాలను తీసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను వీసీ దృష్టికి తీసుకువెళ్లారు.

ఏయూ వీసీ ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం డిస్పెన్సరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న సేవలు, వసతులు తదితర అంశాలపై ఆయన ప్రత్యక్షంగా పరిశీలన చేశారు.

# భారత జట్టులో ఫిక్స్‌ఇట్ ప్లేయర్ అతడే: మిచెల్ స్టార్క్



**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్ఇండియా కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. సెమీస్‌లో ఆసీస్‌ను, ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి మరీ భారత్ విజేతగా నిలిచింది. టీమ్ఇండియా గెలుపులో ప్రతి ఆటగాడు కీలక పాత్ర పోషించారు. అయితే, కేఎల్ రాహుల్ కొత్త పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయాడు. పెద్దగా అనుభవం లేని ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపింగ్‌లోనూ మెరుగ్గానే రాణించాడు. ఈ క్రమంలో కేఎల్‌పై ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్రశంసల వర్షం కురిపించాడు. గాయం కారణంగా స్టార్క్ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడలేకపోయాడు. భారత జట్టులో 'మిస్టర్ ఫిక్స్‌ఇట్' కేఎల్ రాహులేనని స్టార్క్ తెలిపాడు.**

"ఆ మాట అనడానికి చాలా కారణాలు ఉన్నాయి. జట్టు కోసం ఓపెనింగ్ చేస్తాడు. లేదు మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయమంటే అక్కడా ఆడతాడు. కీపింగ్ చేస్తాడు. కీపర్‌గా కాదు ఫీల్డింగ్ చేయమంటే అందుకూ ఓకే చెబుతాడు. ప్రతి దానికి అతడు అర్హుడే. అన్ని పాత్రలనూ పోషించాడు. అతడితో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని స్టార్క్ వెల్లడించాడు.

**'దుబాయ్ అడ్వాంటేజ్‌'పై...**

దుబాయ్ వేదికగా మ్యాచ్‌లు జరగడంతోనే భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిందనే వాదనను స్టార్క్ కొట్టిపడేశాడు. పిచ్ అడ్వాంటేజ్ అనేది అర్థరహితమని వ్యాఖ్యానించాడు. "కచ్చితంగా ఇది అడ్వాంటేజ్ అవుతుందని చెప్పలేను. ఎందుకంటే ఇప్పుడు ఆటగాళ్లు ప్రపంచవ్యాప్తంగా అన్ని ఫ్రాంచైజీ మ్యాచుల్లో ఆడుతున్నారు. కానీ, భారత్ ప్లేయర్లు మాత్రం కేవలం ఐపీఎల్‌కే పరిమితమయ్యారు. సంవత్సరంలో నాలుగైదు లీగుల్లో ఆడేవారితో పోలిస్తే టీమ్ఇండియా ప్లేయర్లకు విదేశీ పిచ్‌లపై అవగాహన తక్కువే ఉంటుందని భావిస్తున్నా. భారత్ ట్రోఫీని కైవసం చేసుకోవడంలో నాకెలాంటి ఆశ్చర్యం కలగలేదు. నిజం చెప్పాలంటే టీమ్ఇండియా ఆడిన మ్యాచ్‌లను చూడలేదు. మా జట్టు మ్యాచులే అప్పుడప్పుడు చూశా. గతేడాది నేను వరుణ్ చక్రవర్తితో కలిసి ఆడా. అతడిలో అద్భుతమైన టాలెంట్ ఉంది" అని స్టార్క్ వ్యాఖ్యానించాడు.

# నా జట్టుకు రోహితే కెప్టెన్..

## పాక్ మాజీ క్రికెటర్



**ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా విజేతగా నిలిచింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫైనల్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. అయితే, ఐసీసీతోపాటు ఇతర మాజీలు ప్రకటించిన జట్టులో అతడికి చోటు ఇవ్వలేదు. కానీ, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ మాత్రం తన జట్టుకు సారథిగా రోహిత్‌నే ఎంపిక చేస్తానని వెల్లడించాడు. ఆమేరకు బసిత్ ప్రకటించిన టీమ్‌లో భారత్ నుంచి ఏకంగా ఆరుగురికి అవకాశం ఇవ్వడం గమనార్హం.**

"నేను కూడా 11 మందితో కూడిన జట్టును ఎంపిక చేశా. దుబాయ్ వేదికగా మ్యాచ్‌లను చూశాం. గడాఫీ స్టేడియంలోనూ మంచి ప్రదర్శనలు ఇచ్చారు. నేను ఏ ఆటగాడు బాగా ఆడాడని భావించానో వారితోనే తుది జట్టును ప్రకటిస్తున్నా. ఐసీసీ జట్టును సరిపోల్చడం లేదు. నా టీమ్ కెప్టెన్‌గా రోహిత్ ఉంటాడు. టోర్నీ ఆసాంతం సారథిగా అద్భుతంగా రాణించాడు. ఫైనల్‌లో అర్ధశతకం సాధించాడు. మ్యాచ్ గతినే మార్చేశాడు. రోహిత్‌కు జోడీ ఓపెనర్‌గా రచిన్ రవీంద్రను ఎంపిక చేశా. అతడు రెండు సెంచరీలు చేశాడు. ఇక వన్‌డౌన్‌లో విరాట్ కోహ్లీ (%ఎఙతీఫ్ ఖశీష్ట్రశ్రీఱ%)నే ఆడాలి. మ్యాచ్ పరిస్థితిని అంచనా వేసి రాణించడం అతడికి అలవాటు. శ్రేయస్ అయ్యర్‌ను నాలుగో స్థానంలో ఆడిస్తా. భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. సెమీస్, ఫైనల్‌లో విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా కేఎల్ రాహుల్, ఆరో స్థానంలో గ్లెన్ ఫిలిప్స్ ఆడతారు. అతడు అద్భుతమైన బౌలరే కాకుండా.. ప్రమాదకరమైన ఫీల్డర్ కూడా. అజ్మతుల్లా ఒమర్జాయ్‌ను ఏడో స్థానంలో ఆడిస్తా. ఆల్‌రౌండర్ పాత్రకు సరిగ్గా సరిపోతాడు" అని వెల్లడించాడు.

**వరుణ్, షమీకి ఛాన్స్..**

"బౌలింగ్ విభాగంలో మంచి పోటీనే ఉంది. ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతా. భారత్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తీసుకుంటా. ఇక రెండో స్పిన్నర్‌గా మిచెల్ శాంట్నర్, అక్షర్ పటేల్ రేసులో నిలిచారు. నేను మాత్రం శాంట్నర్ వైపు మొగ్గు చూపించా. టీమ్ఇండియా సీనియర్ పేసర్ షమీ, మ్యాట్ హెన్రీని ఫాస్ట్ బౌలర్లుగా తీసుకున్నా" అని బసిత్ అలీ వ్యాఖ్యానించాడు. బసిత్ అలీ జట్టు ఇదే: రోహిత్ శర్మ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, విరాట్ కోహ్లీ,

# క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

**బర్మింగ్‌హామ్:** ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లగా.. మిగతా భారత క్రీడాకారులకు నిరాశ తప్పలేదు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్య 21-13, 21-10తో డిఫెండింగ్ ఛాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)ను కంగుతినిపించాడు. తొలి గేమ్‌లో ఆరంభంలో కాస్త వెనుకబడినా తర్వాత లక్ష్య పుంజుకున్నాడు. విరామ సమయానికి 11-7తో నిలిచాడు. బ్రేక్ తర్వాత క్రిస్టీ ప్రతిఘటించడంతో స్కోరు 12-12తో సమమైంది. కానీ అక్కడ నుంచి మళ్లీ జోరు అందుకున్న లక్ష్య.. తొలి గేమ్ గెలిచాడు. రెండో గేమ్‌లోనూ లక్ష్య విజృంభణ ముందు క్రిస్టీ నిలువలేకపోయాడు. వరుస పాయింట్లు రాబట్టిన లక్ష్య.. తేలిగ్గా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో భారత్ కథ ముగిసింది. ఇప్పటికే స్టార్ షట్లర్ పి.వి.సింధు



ఓడిపోగా.. మాళవిక బన్సోద్ కూడా ఇంటిముఖం పట్టింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మాళవిక 16-21, 13-21తో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అకానె యమగూచి (జపాన్) చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో యమగూచికి మాళవిక బాగానే పోటీ ఇచ్చింది. ఆరంభంలో జపాన్ స్టార్ దూకుడుగా ఆడింది. వరుస పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ భారత అమ్మాయి నెమ్మదిగా పుంజుకుంది. 13-15తో ప్రత్యర్థికి సమీపంగా వచ్చింది. కానీ అక్కడ నుంచి యమగూచి దూకుడుగా ఆడింది. అదే జోరుతో తొలి గేమ్ గెలుచుకుంది. రెండో గేమ్‌లో యమగూచి 3-1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే మాళవిక పోరాటం వదల్లేదు. 8-8తో స్కోరు సమం చేసింది. కానీ ఆ తర్వాత అనవసర తప్పిదాలు చేసిన మాళవిక.. ప్రత్యర్థికి తేలిగ్గా పాయింట్లు అప్పగించింది. దీంతో యమగూచి ఎక్కువ కష్టపడకుండా విజయం సాధించింది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. జెంగ్-గ్జియ్ (చైనా) జంటతో ప్రిక్వార్టర్స్‌లో 16-21, 2-2తో ఉన్న సమయంలో చిరాగ్‌కు వెన్ను గాయం కావడంతో భారత జోడీ పోటీ నుంచి తప్పుకుంది.

# నాకంటే ధోనీనే లక్కీ..

## సాక్షి కామెంట్‌కు పంత్ రియాక్షన్ వైరల్



**భారత క్రికెటర్ రిషభ్ పంత్ సోదరి సాక్షి వివాహానికి సెలబ్రెటీలు పెద్దఎత్తున వచ్చారు. టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ధోనీతో కలిసి గౌతమ్ గంభీర్ కలిసి దిగిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక ధోనీతో సహా ప్రముఖులు చేసిన డ్యాన్స్ కూడా అభిమానులను ఆకట్టుకున్నాయి. పంత్‌తో కలసి ధోనీ స్టెప్స్ వేస్తూ అలరించాడు. హుషారుగా డ్యాన్స్ చేస్తూ, విజిల్స్‌తో అదరగొట్టాడు. పంత్, రైనా, ధోనీ ఎగురుతూ.. ఒకరి భుజాల మీద మరొకరు చేతులు వేసుకొని చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. ఈక్రమంలో ధోనీ భార్య సాక్షి చేసిన ఫన్నీ కామెంట్లకు పంత్ ఇచ్చిన రియాక్షన్ అదిరిపోయింది. ఇంతకీ ఏం జరిగిందంటే?**

ధోనీతో తన బంధంపై సాక్షి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మా రిలేషన్‌లో నాకంటే ధోనీనే అత్యంత ఎక్కువ అదృష్టవంతుడు" అని సాక్షి తెలిపారు. ఆ మాటలకు వెంటనే పంత్ స్పందిస్తూ.. "ప్రతి అమ్మాయి ఇలానే ఆలోచిస్తుంది" అంటూ వ్యాఖ్యానించాడు. దీంతో అక్కడున్నవారంతా నవ్వేశారు. ధోనీ కూడా చిరునవ్వులు చిందించాడు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది.

# ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా అక్షర్ పటేల్



ఐపీఎల్ 18వ సీజన్ మరో ఎనిమిది రోజుల్లో ప్రారంభం కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ తమ కెప్టెన్‌ను ప్రకటించింది. యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు అవకాశం కల్పించింది. సీనియర్ ప్లేయర్ కేఎల్ రాహుల్ జట్టులో ఉన్నప్పటికీ.. అతడు సారథ్యం తీసుకొనేందుకు మొగ్గు చూపలేదు. దీంతో అక్షర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ ఢిల్లీ ఫ్రాంచైజీ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసింది. గత సీజన్‌లో జట్టును నడిపించిన రిషభ్ పంత్‌ను ఈసారి వదులుకున్న సంగతి తెలిసిందే. అతడిని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్లకు తీసుకుని కెప్టెన్సీ అప్పగించింది.

**కీలక ఆల్‌రౌండర్‌గా ఎదుగుతూ..**

ప్రస్తుత భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా స్పిన్ ఆల్‌రౌండర్. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికేశాడు. అతడి స్థానంలో టీమ్ఇండియాకు కీలకంగా మారే ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ విలువైన పరుగులు చేయగలడు. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో అక్షర్ ఆటను చూశాం. ఐదో స్థానంలో వచ్చి కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పటి వరకు భారత్ తరఫున 14 టెస్టులు, 68 వన్డేలు, 71 టీ20లు ఆడిన అక్షర్.. 150 ఐపీఎల్ మ్యాచుల్లో పాల్గొన్నాడు. ఐపీఎల్‌లో 1,653 పరుగులు, 123 వికెట్లు పడగొట్టాడు.

# బ్రూక్‌పై వేటు

అనుకున్నదే అయింది. ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై రెండేళ్ల పాటు ఐపీఎల్‌లో ఆడకుండా నిషేధం పడింది. అతను వరుసగా రెండో ఏడాది ఐపీఎల్ నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. వేలంలో అమ్ముడైన ఆటగాడు ఫిట్‌గా ఉండి కూడా ఐపీఎల్‌కు వరుసగా రెండు సీజన్లు దూరం అయితే.. ఐపీఎల్ నిబంధనల ప్రకారం రెండేళ్ల నిషేధం పడుతుంది. గత ఏడాది తన బామ్మ మరణాన్ని కారణంగా చూపి లీగ్ నుంచి తప్పుకొన్న బ్రూక్.. ఈ ఏడాది ఇంగ్లాండ్ తరఫున ఆడాల్సిన భవిష్యత్ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని ఐపీఎల్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. తనను వేలంలో కొన్న ఢిల్లీ ఫ్రాంఛైజీకి అతను క్షమాపణలు కూడా చెప్పాడు. కానీ గాయపడకపోయినా చివరి నిమిషంలో ఇలా లీగ్ నుంచి తప్పుకోవడం ఆ ఫ్రాంఛైజీకి తీవ్ర ఇబ్బంది కలిగించేదే. అందుకే నిబంధనల ప్రకారం ఇంకో రెండేళ్ల పాటు ఐపీఎల్‌లో ఆడకుండా బ్రూక్‌పై నిషేధం విధించారు. బ్రూక్‌పై నిషేధం ఈ సీజన్ నుంచే



అమల్లోకి వస్తుంది. అతను 2027లో ఐపీఎల్‌లో పాల్గొనవచ్చు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సినీ ఇండస్ట్రీని షేక్ చేస్తున్న

# రష్మిక మందన్న





సినీ ఇండస్ట్రీని షేక్ చేస్తున్న రష్మిక మందన్న నిన్నమొన్నటి వరకూ 'నేషనల్ క్రష్'గా అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించిన రష్మిక మందన్న, ఇప్పుడు వరుస బ్లాక్‌బస్టర్ హిట్లతో 'బాక్సాఫీస్ క్వీన్'గా మారిపోయింది.గత 16 నెలల్లో ఆమె మూడు సినిమాల్లో నటించి, ఈ భామకు వచ్చిన పాపులారిటీ భారతీయ సినిమా చరిత్రలో మరెవ్వరికీ రాలేదని చెప్పడం అతి పెద్ద ప్రశంస.రష్మిక నటించిన మూడు సినిమాలు %-% యానిమల్ (2023), పుష్ప 2: ది రూల్ (2024), చావా (2025) %-% బాక్సాఫీస్ వద్ద అద్భుతంగా వ్యాపించాయి. ఈ మూడు సినిమాలు కలిపి రూ. 3300 కోట్లకు పైగా వసూలు చేశాయి. రణబీర్ కపూర్, అల్లు అర్జున్, విక్కీ కౌశల్ వంటి అగ్ర కథానాయకులతో కలిసి ఈ సినిమాలు సూపర్ హిట్లుగా నిలిచాయి. దీంతో రష్మికపై ప్రశంసలు కురుస్తున్నాయి.రష్మిక పాత్రల ఎంపిక, స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ స్కిల్స్ అన్ని కలిసి ఆమెను స్టార్‌డమ్‌కు తీసుకెళ్లాయి.ఈరోజుకి, రష్మిక భారతదేశం లో అత్యధిక వసూళ్లు సాధించిన హీరోయిన్‌లలో ఒకరిగా నిలిచింది.ముఖ్యంగా యానిమల్ మువీ రూ. 502.98 కోట్లను, పుష్ప 2: ది రూల్ హిందీలో రూ.812 కోట్లను వసూలు చేసింది. ప్రస్తుతం చావా ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల వసూళ్లతో బాక్సాఫీస్‌ని ఊపేస్తోంది.ఈ సంవత్సరం చివరిలో రష్మిక స్టార్‌డమ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.గతంలో ప్రియాంక చోప్రా,దీపికా పదుకొనే,ఆలియా భట్ వంటి నాయికలు బాలీవుడ్‌లో బాక్సాఫీస్‌ను ఏలితే, ఇప్పుడు రష్మిక కూడా అదే దిశలో దూసుకుపోతుంది. ఇంకా రష్మిక త్వరలో సల్మాన్ ఖాన్ తో బాలీవుడ్‌లో హిట్ మూవీ చేయబోతుంది.2025లో విడుదల కానున్న సికందర్ చిత్రంలో సల్మాన్‌తో జోడీ కడుతోంది.ఈ మూవీ ఈద్ 2025 నాటికి ప్రేక్షకుల ముందుకు రానుంది.మరోవైపు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర మరియు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో థమ అనే రెండు సినిమాల్లో కూడా రష్మిక నటించనుంది




## హరిహర వీరమల్లు విడుదల తేదీని

# ప్రకటించిన నిర్మాతలు




పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'హరహర వీరమల్లు' సినిమా గురించి హెూలీ పండుగ సందర్భంగా మేకర్స్ ఓ బిగ్ అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించి కొత్త విడుదల తేదీని వెల్లడించారు. ముందుగా ప్రకటించిన మార్చి 28 విడుదల తేదీని మారుస్తూ, మే 9, 2025న సినిమాను థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ముందుగా 2025 మార్చి 28న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించినా, కొన్ని పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్న ఈ సినిమా పనులను మరింత మెరుగుపరిచేలా మేకర్స్ కృషి చేస్తున్నారు. అందుకే సినిమాను వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. నూతన రిలీజ్ డేట్ ప్రకటిస్తూ హెూలీ స్పెషల్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ కొత్త పోస్టర్‌లో పవన్ కళ్యాణ్, కథానాయిక నిధి అగర్వాల్ గుర్రపు స్వారీ చేస్తూ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఈ పోస్టర్‌తో చిత్రబృందం పవన్ ఫ్యాన్స్‌కి, సినీ ప్రేక్షకులకు హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రం 17వ శతాబ్దంలో మఘల్, కుతుబ్‌షాహి పాలన నేపథ్యంలో రొమాంచకమైన కథతో తెరకెక్కుతోంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి స్వరాలు అందిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందనుంది.

**మూవీపై భారీ అంచనాలు!**

పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో అవంతి యోధుడిగా ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా విడుదలకు ఇంకా రెండు నెలల సమయం ఉన్నప్పటికీ, అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ లుక్, టీజర్‌కి అదిరిపోయే రెస్పాన్స్ రావడంతో, ఇప్పుడు విడుదల తేదీ మార్పుపై మిక్స్‌డ్ రియాక్షన్స్ వ్యక్తమవుతున్నాయి. అయితే, భారీ బడ్జెట్, గ్రాండ్ విజువల్స్‌తో ప్రేక్షకుల్ని విశేషంగా అలరించే సినిమా కానుందనే నమ్మకం ఉందని మేకర్స్ చెబుతున్నారు.

హీరో: పవన్ కళ్యాణ్
హీరోయిన్: నిధి అగర్వాల్
ప్రధాన పాత్రలు: బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, నర్గిస్ ఫక్రీ, నోరా ఫతేహి, సునీల్ తదితరులు
సంగీతం: ఎం.ఎం. కీరవాణి
దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి
నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్

హరహర వీరమల్లు నుంచి త్వరలో టీజర్, ట్రైలర్

తాజా సమాచారం ప్రకారం, ఏప్రిల్ మూడో వారంలో మేకర్స్ టీజర్ విడుదల చేయనున్నారు. ఇక ట్రైలర్‌ను మే మొదటి వారంలో రిలీజ్ చేసే అవకాశం ఉంది.

# ప్రఖ్యాత నటుడు దేబ్ ముఖర్జీ మృతి



ప్రముఖ బాలీవుడ్ నటుడు, చిత్రనిర్మాత దేబ్ ముఖర్జీ ముంబైలో కన్నుమూశారు. 83 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో బాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి. 1960, 70లలో అనేక చిత్రాల్లో నటించిన దేబ్ ముఖర్జీ, "ఏక్ బార్ మూస్కురా దో" (1972), "జో జీతా వోహి సికందర్" (1992), "లాల్ పత్తర్" (1971) వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆయన కుమారుడు అయాన్ ముఖర్జీ బాలీవుడ్‌లో ప్రముఖ దర్శకుడిగా పేరొందారు.

**దుర్గా పూజ వేడుక**

ముంబై సాంస్కృతిక రంగంలో దేబ్ ముఖర్జీ గణనీయమైన పాత్ర పోషించారు. అక్కడ జరిగే దుర్గా పూజ వేడుకల్లో ఒకటైన నార్త్ బాంబే సర్బోజానిన్ దుర్గా పూజ పండల్ నిర్వాహకులలో ఆయన ఒకరు . కాగా అయాన్ ముఖర్జీ ప్రస్తుతం హృతిక్ రోషన్,జూనియర్ ఎన్టీఆర్ లతో వార్ 2 మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పుడు తండ్రి మరణంతో ఆయన అయాన్ కొన్ని రోజులు వార్ 2 షఉటింగ్‌కు బ్రేక్ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

**అంత్యక్రియలు**

దేబ్ ముఖర్జీ అంత్యక్రియలు ఈరోజు సాయంత్రం 4:00 గంటలకు ముంబైలోని జుహూ పవన్ హన్స్ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. బాలీవుడ్ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆయన సన్నిహితులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. ప్రముఖ నటి తనూజ, కాజోల్, రాణీ ముఖర్జీ, నటుడు అజయ్ దేవ్‌గన్, దర్శకుడు ఆదిత్య చోప్రా, అశుతోష్ గోవారికర్, రణ్‌బీర్ కపూర్,ఆలియా భట్ తదితరులు అంత్యక్రియలకు హాజరవుతారని భావిస్తున్నారు. ఇక అయాన్ ముఖర్జీ ప్రస్తుతం హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న "వార్ 2" సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అయితే తండ్రి మృతితో అయాన్ కొన్ని రోజులు షఉటింగ్‌కు విరామం ఇచ్చే అవకాశముంది. దేబ్ ముఖర్జీ మృతి బాలీవుడ్ సినీ పరిశ్రమకు తీరని లోటుగా మిగిలింది.బాలీవుడ్ పరిశ్రమ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తోంది.

# ఓటీటీలోకి వచ్చేసిన ఏజెంట్



యువ హీరో అఖిల్ ఇప్పటివరకు తన కెరీర్‌లో సరైన హిట్‌ను అందుకోవడంలో విఫలమయ్యాడని చెప్పాలి. హాలీవుడ్ హీరోలతో పోటీ పడేలా హ్యాండ్సమ్ లుక్, మంచి టాలెంట్ ఉన్నప్పటికీ, అతని సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాయి. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ సినిమా మాత్రం ఓ మోస్తరు విజయాన్ని అందుకున్నప్పటికీ, మిగతా సినిమాలు అంతగా రాణించలేదు. ఇక చివరిగా ఏజెంట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అఖిల్, భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయింది.సినిమా ఇండస్ట్రీలో చిన్న చిత్రాల నుంచి పెద్ద సినిమాల వరకు వరుస విజయాలు నమోదు అవుతున్నా, అఖిల్ మాత్రం తన కెరీర్‌ను నిలబెట్టుకునే హిట్ అందుకోలేకపోతున్నాడు. వివి వినాయక్ దర్శకత్వంలో వచ్చిన అఖిల్ సినిమా పెద్దగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత హాలో, మిస్టర్ మజ్ను, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, ఏజెంట్ వంటి సినిమాలు చేశాడు. వీటిలో ఏజెంట్ సినిమా అతని కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ప్రాజెక్ట్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో, ఏకే ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై భారీ ఖర్చుతో నిర్మించబడిన ఈ సినిమా ఊహించని విధంగా బాక్సఆఫీస్ దగ్గర బోల్తా కొట్టింది.

**ఓటీటీలో లో రిలీజ్**

అయితే నెలలు గడుస్తున్నా ఏజెంట్ సినిమా ఓటీటీలోకి మాత్రం రాలేదు. ఈ సినిమా ఎప్పుడుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ప్రేక్షకులంతా ఎదుచూస్తున్నారు.సాధారణంగా థియేటర్స్ లో రిలీజ్ అయిన సినిమాలు నెల రోజులకు ఓటీటీలోకి వస్తాయి,కొన్ని సినిమాలు వారం రోజులకే వస్తాయి. అని ఏజెంట్ సినిమా మాత్రం ఇంతవరకు ఓటీటీలోకి అడుగు పెట్టలేదు. దానికి కారణం తెలియదు కానీ అసలు ఈ సినిమా ఎలా ఉంది? ఎందుకు అంతలా డిజాస్టర్ అయ్యింది? అని చూద్దామని చాలా మంది ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఎట్టకేలకు ఏజెంట్ సినిమా ఓటీటీలోకివచ్చింది.

**హెూలీ సందర్భంగా**

ఇదిలా ఉండగా, ఎట్టకేలకు హెూలీ సందర్భంగా మార్చి 14న సినిమా స్ట్రీమింగ్ అవుతుందని అనౌన్స్ చేసినప్పటికీ, ఊహించని విధంగా మార్చి 13 సాయంత్రం నుంచే సోనీ లివ్ వేదికగా స్ట్రీమింగ్ ప్రారంభమైంది.ఈ సినిమా కోసం అఖిల్ చాలా కష్టపడ్డాడు. సిక్స్ ప్యాక్ బాడీతో అదరగొట్టాడు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వచ్చిన ఈ సినిమా డిజాస్టర్ అయ్యిన తర్వాత అఖిల్ చాలా కాలం అజ్ఞాతవాసంలో ఉన్నాడు. ఇంతవరకు కొత్త సినిమాను కూడా అనౌన్స్ చేయలేదు.త్వరలోనే తన కొత్త సినిమాను అనౌన్స్ చేయనున్నట్టు టాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈసారి ఎలాంటి జానర్‌ను ఎంచుకుంటాడో చూడాలి. అఖిల్‌కు కమర్షియల్ హిట్ అందించే దర్శకుడెవరో చూడాలి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339